క్లుప్తంగా

సీసీ రోడ్లు వేయాలి



రహదారిలో గుంతను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని అనంతయ్య కాంప్లెక్స్ ఎదుట వెంటనే సీసీ రోడ్లు వేయాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండీ షరీఫ్, అబ్దుల్ దేశాయ్ డిమాండ్ చేశారు. కంకర తేలి గుంతలు పడిన రోడ్లపై వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. శిథిలమైన రహదారిని వెంటనే నిర్మించాలని కోరారు.

సన్మానం



జగన్నాథంను సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): తమిళనాడులోని నాగపట్టణంలో జరిగినఏఐకేఎస్ జాతీయ మహాసభల్లో ఆ కమిటీ జాతీయ సమితి సభ్యుడిగా ఎన్నికైన కె.జగన్నాథంను సీపీఐ నాయకులు మంగళవారం సన్మానించారు. స్థానిక సీఆర్ భవన్‌లో ఆయనను పార్టీ నాయకలు రామకృష్ణారెడ్డి, మునెప్ప, లెనిన్‌బాబు, శ్రీనివాసులు, పుల్లన్న, మహ్మద్ బాషా, రమేష్, మహేష్, సురేష్, నల్లన్నలు శాలువ కప్పి సన్మానం చేశారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ



స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. శాంతికళ ఆదేశాల మేరకు మంగళవారం కర్నూలు నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను ప్రోగ్రామ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్కానింగ్ కేంద్రంలోని రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల రికార్డులు, రిపోర్టులు నిబంధనల ప్రకారం నిర్వహించాలని, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదని, అలా చేస్తే పీసీ పీఎన్ డీటీ యాక్ట్ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యారెడ్డి, డాక్టర్ శ్రీదేవి, డెమో శ్రీనివాసులు శెట్టి, మానటరింగ్ కన్సల్టెంట్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఏజీఎస్ సంస్థ ఉద్యోగులపై చీటింగ్ కేసు నమోదు

కర్నూలు: ఏజీఎస్ సంస్థ ఉద్యోగులపై రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివిధ బ్యాంకులకు సంబంధించిన ఏటీఎం కేంద్రాల్లో డబ్బులు నింపే బాధ్యత బ్యాంకులు ఆ సంస్థకు అప్పగించాయి. అయితే ఆ సంస్థలో పని చేసే ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇవ్వనందుకు జనవరిలో రూ.28 లక్షలు ఏటీఎంలలో నింపకుండా జీతాల కింద వాడేసుకున్నారు. విషయం ఆలస్యంగా బయటపడటంతో ఆ సంస్థ మేనేజర్ శ్రీనివాస్ శాస్త్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంస్థలో పనిచేసే ఉద్యోగులు ఉదయ్ కుమార్, రాఘవేంద్ర, ఖాజా మొహిద్దిన్, మధుమోహన్‌లపై చీటింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పన్ను వసూళ్లకు ప్రత్యేక ప్రణాళిక

కర్నూలు (టౌన్): ఆస్తి పన్ను, తాగునీటి పన్నులకు సంబంధించి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ అమలు చేసినట్లు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో అశోక ఉమెన్స్ కళాశాల యజమాన్యం రూ.12.64 లక్షలు, ఏపీ స్టేట్ వేర్‌హౌస్ కార్యాలయ అధికారులు రూ.6.71 లక్షల ఆస్తిపన్ను మొత్తాన్ని అదనపు కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ మొండి బకాయిలతో పాటు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్ను ముందస్తు చెల్లింపులపై 5 శాతం రాయితీ, బకాయి పడిన వాటిపై 50 శాతం మాఫీ ప్రకటించిందన్నారు. పన్నుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.13.77 కోట్లు ఆస్తిపన్ను వసూలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఓ జునీద్, ఆర్ఐలు మన్సూర్, ఖలీల్ ఉర్ రెహమాన్ పాల్గొన్నారు.

మాటల్లో దింపి.. నగదుతో ఉడాయించి

హొళగుంద: చిన్నహ్యాట గ్రామం ఆలూరు రోడ్డులోని ఓ కిరాణ దుకాణంలో వ్యాపారిని ఇద్దరు వ్యక్తులు మాటల్లో దింపి నగదు తీసుకుని ఉడాయించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడు వడ్డె ఉరుకుంద కుమారుడు వీరాంజనేయులు తెలిపిన వివరాలు.. మధ్యాహ్నం ఉరుకుందను దుకాణంలో కూర్చోబెట్టి కుమారుడు వీరాంజనేయులు భోజనానికి వెళ్లాడు. అదే సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి ఉరుకుందను మాటల్లో దింపి చాకచక్యంగా రూ.6 వేలు తీసుకుని ఉడాయించారు. అనంతరం తండ్రీకుమారుడు సీసీ ఫుటేజీని పరిశీలించి చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆరోగ్యంపై రంగు పడుద్ది!

- గత మార్చి నెలలో శ్రీశైలంలోని పలు హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. ఓ హోటల్‌లో గోబీ మంచూరియా తయారీలో కృత్రిమ రంగులను వాడుతున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. మరో స్వీట్‌షాపులో బరానీలకు సింథటిక్ ఫుడ్ కలర్ వినియోగిస్తున్నట్లు గుర్తించి వాటిని చెత్త కుప్పలో పారబోయించారు.
- కర్నూలు నగరంలోని బి.క్యాంపులో ఉన్న ఓ కూల్ డ్రింక్‌షాపులో నన్నారి, ఇతర కూల్‌డ్రింకులలో కృత్రిమ రంగులు కలిపి విక్రయిస్తున్నట్లు ఫుడ్‌సేఫ్టీ అధికారులు గుర్తించి వాటిని శాంపిల్ తీసి ల్యాబ్‌కు పంపగా అవి ఆహారానికి పనికిరావని తేలింది.

- ఆహారంలో విచ్చలవిడిగా కృత్రిమ రంగుల వాడకం
- హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరి, కూల్‌డ్రింక్స్‌లలో అధికం
- జీర్ణకోశవ్యాధులు, క్యాన్సర్‌కు దారి
- తరచూ దాడులు చేస్తున్నా తీరు మారని వ్యాపారులు



కృత్రిమ రంగు కలిపిన బిర్యానీ



రంగు కలిపిన గోబీ మంచూరియా



బరానీలకు ఇంతే..



నగరంలో కృత్రిమ రంగును పారబోస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): ఆహార పదార్థాలు కంటికి ఇంపుగా రంగురంగులుగా, ఆకర్షణీయంగా కనిపిస్తే వెంటనే వెళ్లి వాటిని తినడమో, తాగడమో చేసేస్తాం. ఇలాంటి రంగులు కలిపిన పదార్థాల వల్ల ఎలాంటి అనర్థాలు జరుగుతాయో ఆలోచించం. ఇలాంటి కంటికి ఇంపుగా కనిపించే ఆహార పదార్థాల్లో చాలా మంది వ్యాపారులు ప్రమాదకర రసాయనాలతో తయారైన కృత్రిమ రంగులు కలుపుతున్నారు. వీటి వల్ల జీర్ణకోశ వ్యాధులు, క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు సైతం పలు దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నా వ్యాపారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో చిన్నా పెద్దా హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, చాట్, నూడుల్ షాపులు అన్నీ కలుపుకుని దాదాపు 12 వేలకు పైగా ఉంటాయి. ఒక్క కర్నూలు నగరంలోనే 3 వేల దాకా హోటళ్లు, దుకాణాలు, రోడ్డుసైడు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. వాస్తవానికి ఈ దుకాణాలు ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి లైసెన్స్ తీసుకోవాల్సి ఉంది. ఆ శాఖ నిబంధనల మేరకు ఆహారం తయారు చేయాలి. ఈ చట్టం 2006 నుంచి అమల్లో ఉంది. ఆ శాఖలో ఒక డిస్ట్రిక్ట్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, నలుగురు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, ఒక సూపరింటెండెంట్ పనిచేస్తున్నారు. వీరంతా ఒక్కొక్కరు ప్రతి నెలా 12 శ్యాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించాల్సి ఉంది. ఇలా ల్యాబ్‌కు పంపిన శాంపిల్స్‌ను నివేదికల ఆధారంగా సదరు వ్యాపారులపై కేసులు నమోదు చేసి జరిమానా, శిక్షలు విధిస్తారు. ఈ ప్రక్రియకు కొన్ని కేసుల్లో నెలల తరబడి సమయం పడుతోంది.

సింథటిక్ కలర్స్ కలిపితే నేరం



నిత్యం తినే ఆహారంలో సింథటిక్ ఫుడ్ కలర్స్ కలపడం నేరం. ఫుడ్ ఇన్స్‌పెక్టర్లతో కలసి విస్తృతంగా దాడులు చేస్తున్నాం. ఎక్కువగా గోబీమంచూరియా, చికెన్ దమ్ బిర్యానీల్లో సింథటిక్ కలర్స్ కలుపుతున్నారని గుర్తించాం. ఈ మేరకు వ్యాపారులను హెచ్చరించి నోటీసులు జారీ చేశాం. ఆహార పదార్థాల్లో సింథటిక్ కలర్స్ కలపడం ఆరోగ్యానికి హానికరం. ఇలాంటివి ఎక్కడైనా కనిపిస్తే ఎవ్వరైనా సరే కర్నూలు నగరంలోని సి.క్యాంపులోని తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు.

– కూర్మానాయకులు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ఉమ్మడి కర్నూలు జిల్లా

విష రసాయన రంగుల వినియోగం

ఉమ్మడి జిల్లాలోని స్వీట్స్ తయారీ కేంద్రాలు, విక్రయ కేంద్రాలతో పాటు హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పరిమితికి మించి ప్రాణాంతక బుష్‌పౌడర్ వాడుతున్నారు. నిబంధనల మేరకు ఒక కిలోకు 0.001 మి.గ్రా వాడాలి. కానీ ఆహార పదార్థాలు ఆకర్షణీయంగా కనిపించాలన్న ఉద్దేశంతో వ్యాపారులు ఒక కిలోకు 10 నుంచి 20 మి.గ్రా ఫుడ్ కలర్ వాడుతున్నారు. ఇది పరిమితికి మించి వాడితే దానిని తిన్న వారికి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నా పట్టించుకునే వారు కరువు. ముఖ్యంగా వీటిని గోబీ మంచూరియా, రెస్టారెంట్లలో బిర్యానీలు, గ్రేవీ ఐటమ్స్, పలు రకాల ఫ్రై ఐటమ్స్, స్వీట్లు, చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లు, కేక్‌లు, కూల్‌డ్రింక్‌లలో ఎక్కువగా వాడుతున్నారు. ఈ కారణంగా వాటిని తిన్న వారికి భవిష్యత్‌లో జీర్ణకోశ వ్యాధులు, కాలేయ వ్యాధులు, క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

దాడులు లెక్కచేయని వ్యాపారులు

ఇటీవల నగరంలోని బి.క్యాంపులోని ఓ కూల్ డ్రింక్‌షాపులో ఓ వైపు కూల్‌డ్రింక్స్‌ను తనిఖీ చేస్తున్నా మరోవైపు రసాయన రంగులు కలిపిన కూల్‌డ్రింక్‌ను సదరు వ్యాపారి విక్రయించడం అధికారుల పట్ల వారి నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. ఎవ్వరిపైనా దాడులు నిర్వహిస్తే వెంటనే సదరు వ్యాపారులు స్థానిక ప్రజాప్రతినిధిని కలిసి అధికారులపై బెదిరింపులకు దిగుతున్నారు. ఇటీవల ఫుడ్‌సేఫ్టీ అధికారులు పలు వ్యాపారాలపై తరచూ దాడులు నిర్వహిస్తున్నా చాలా మంది వ్యాపారులు ఏ మాత్రం చలనం లేకుండా అక్రమంగా కృత్రిమ రంగులు కలిపిన ఆహార పదార్థాలను విక్రయిస్తునే ఉన్నారు. గతంలోనూ కృష్ణానగర్‌లోని ఓ బేకరి, సెంట్రల్ ప్లాజాకూ సమీపంలో స్వీట్స్, కారా దుకాణాలపై అధికారులు దాడులు నిర్వహించినా వారికి ఇదే విధమైన అనుభవం ఎదురైంది.

విచ్చలవిడిగా వ్యాపారం

ఆహారానికి సంబంధించి ఏదైనా ఆహార విక్రయానికి సంబంధించిన వ్యాపారం చేయాలంటే తప్పనిసరిగా ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ(ఫుడ్ సేఫ్టీ కార్యాలయం) నుంచి అనుమతి తీసుకోవాలి. కర్నూలు నగరంలో ఈ కార్యాలయం స్థానిక సి.క్యాంపు సెంటర్‌లో ఉంది. ఈ కార్యాలయం నుంచి అనుమతి తీసుకున్న తర్వాతే వ్యాపారం నిర్వహించాల్సి ఉంది. ఇందు కోసం ప్రభుత్వానికి నిర్ణీత రుసుం చెల్లిస్తే అధికారులు పరిశీలించి లైసెన్స్ జారీ చేస్తారు. కానీ 70 శాతం మంది వ్యాపారులు ఈ కార్యాలయం నుంచి అనుమతులు తీసుకోకుండానే వ్యాపారం చేస్తున్నారు. కొన్ని పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు మినహా అధిక శాతం హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్డుసైడు హోటళ్లలో పరిశుభ్రత గురించి అస్సలు పట్టించుకోవడం లేదు.

డీఎస్సీకి వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలి



ఆందోళన చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

కర్నూలు(సెంట్రల్): డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితిన 47 ఏళ్లకు పెంచాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు రామన్న, నగేష్ డిమాండ్ చేశారు. మంగళవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బిర్లాగేటు సమీపంలో డీఎస్సీ అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కొన్ని కఠినతరమైన నిబంధనలు ఉన్నాయని వాటిని తొలగించాలని కోరారు. ముఖ్యంగా డీఎస్సీ పరీక్షలను ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో జిల్లా యూనిట్‌గా తీసుకొని నిర్వహించాలన్నారు. ఎక్కువ సిలబస్ ఉండడంతో పరీక్షకు 70–90 రోజుల వ్యవధి ప్రిపరేషన్ కోసం ఇవ్వాలన్నారు. జూన్ 16–26 మధ్య ఏపీపీఎస్సీ పరీక్షలు ఉండడంతో రెండు పరీక్షలు రాసే అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీలలో కచ్చితంగా 45 శాతం వచ్చి ఉండాలనే నిబంధనను తొలగించాలని కోరారు.

లెనిన్ స్ఫూర్తితో పోరాటం

కర్నూలు(సెంట్రల్): లెనిన్ స్ఫూర్తితో సామ్రాజ్యవాదం, మతోన్మాదాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని సీపీఎం నాయకులు ప్రకటించారు. మంగళవారం లెనిన్ 155వ జయంతిని పురస్కరించుకొని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కె.ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మతోన్మాదులు పెట్రేగిపోతున్నారన్నారు. సమాజాన్ని మతం, కులం పేరుతో నిలువునా చీల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ ఆనంద్‌బాబు, కేవీ నారాయణ, ఎండీ అంజిబాబు, టి.రాముడు, వెంకటేశ్వర్లు, అలివేలమ్మ, అరుణమ్మ, నరసింహ, రాజశేఖర్, నగేష్ పాల్గొన్నారు.



లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఐ కార్యాలయంలో..

కర్నూలు(సెంట్రల్): కార్మిక, కర్షక నేత లెనిన్ జయంతివేడుకలను సీపీఐ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవార ఉదయం పార్టీ కార్యాలయంలో లెనిన్ చిత్రపటానికి పార్టీ సీనియర్‌నాయకులు జగన్నాథం, లెనిన్‌బాబు, రామకృష్ణారెడ్డి, మునెప్ప తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మాదిగలకు 7 శాతం రిజర్వేషన్ కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ విధానాన్ని సవరించి మాదిగలకు 7 శాతం రిజర్వేషన్‌ను కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఎస్సీ వర్గీకరణలో రోస్టర్‌ను సవరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ విధానాన్ని అనుసరించి రెల్లి ఉపకులాలకు 1 శాతం, మాదిగ, ఉప కులాలకు 6.5 శాతం, మాల, ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్‌ను కల్పించినట్లు చెప్పారు. అయితే ఈరోస్టర్‌ను సవరించకపోతే మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. మాదిగ, మాల ఉప కులాలకు 7 శాతం చొప్పున విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బైరాపురం రాజు, సూరిబాబు, విహార్, రాజశేఖర్, లక్ష్మన్న, నాగరాజు, మీసాలదాసు,సుజాతమ్మ, సుంకులమ్మ, రాధమ్మ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు

ఇరువర్గాల ఘర్షణ

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మాపురం అంచె సమీపంలో ఉన్న ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడ్డారు. పగిడ్యాలకు చెందిన పగడం శేషన్న, కాటిపోగు సురేష్ వర్గాల మధ్య కొంత కాలంగా పొలం వివాదం ఉంది. కాటిపోగు సురేష్ అక్రమంగా తమ పొలాన్ని ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని పగడం శేషన్న సోదరులు కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారు. ఉదయం పొలానికి వెళ్లి ట్రాక్టర్‌తో సేద్యం చేసేందుకు ప్రయత్నించగా కాటిపోగు సురేష్ సోదరులు, కుటుంబీకులు అడ్డుకొని గొడవకు దిగారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుని పరస్పరం కర్రలతో దాడులకు పాల్పడ్డారు. ఇరువర్గాల్లోని పలువురికి గాయాలయ్యాయి. స్టేషన్‌కు చేరుకుని పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ విషయంపై నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా దాడులకు పాల్పడినది వాస్తవమేనని విచారించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేయండి

కర్నూలు (టౌన్): నగరంలోని 13వ వార్డు బంగారు పేటలో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక ఎస్ఈ రాజశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన పనులను పరిశీలిం ఈఈ సత్యనారాయణను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఆనంద్ థియేటర్ వెనుక ఉన్న కేసీ కెనాల్ పక్కన ప్రధాన రహదారి నుంచి కేవీఆర్ కళాశాల వరకు రూ. 40 లక్షలతో రహదారి పనులు జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట డీఈఈ కృష్ణ లత, ఏఈ మహేష్ పాల్గొన్నారు.



బంగారు పేట వద్ద రోడ్డు నిర్మాణ పనుల గురించి ఆరా తీస్తున్న మున్సిపల్ ఎస్ ఈ రాజశేఖర్

మృతి చెందిన భవన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): గూడూరులో మట్టి పెల్లలు విరిగిపడి మరణించిన భవన నిర్మాణ కార్మికులకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సభ్యుడు కేవీ నారాయణ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కాంప్లెక్స్ నిర్మాణం కోసం జరుగుతున్న పనుల్లో సోమన్న, బోయ మధు అనే కార్మికులు చనిపోయారని, వారి కుటుంబాలను ఆదుకోవడం కోసం ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలన్నారు.

25 నుంచి ఉచిత వేసవి శిక్షణా శిబిరం

కర్నూలు కల్చరల్: శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి మే 5వ తేదీ వరకు ఉచిత వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు సమితి కన్వీనర్ మాకా అశోక్ కుమార్ తెలిపారు. నెహ్రూనగర్‌లోని సాయిమందిరంలో ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. రోజువారి జీవితంలో ఉపయోగించే శ్లోకాలు, ప్రార్థనలు, పిల్లల్లో మానవతా విలువలు పెంపొందించడానికి అవసరమైన కథలు, భారతీయ సంస్కృతికి సంబంధించిన ప్రాథమిక వివరణ, పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలు నేర్పించడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు 7013392139, 9908077277ను సంప్రదించాలన్నారు.

హెల్త్ సూపర్‌వైజర్లకు పదోన్నతి కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): కడప జోనల్ పరిధిలో పలువురు హెల్త్ సూపర్‌వైజర్లకు పీహెచ్ఎన్‌లుగా మంగళవారం కడపలోని ప్రాంతీయ ఆరోగ్య సంచాలకుల కార్యాలయంలో ఆర్‌డీ డాక్టర్ రామగిడ్డయ్య ఆధ్వర్యంలో పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. జోనల్ పరిధిలో 22 మందికి కౌన్సెలింగ్ నిర్వహించగా 18 మంది పదోన్నతి పొందారు. ఇందులో సి.రామక్క హొళగుంద పీహెచ్‌సీకి, నాగలక్ష్మమ్మ వేల్పనూరుకు, మాణిక్యమ్మ మద్దూరుకు, ఆర్.ప్రభావతి కొత్తపల్లికి, ఏడీ. ఇంద్రధోరతి పలుకూరుకు బదిలీ అయ్యారు. వీరితో పాటు కర్నూలు జిల్లాకు చెందిన హేమలత అనంతపురం జిల్లా బి. పప్పూరు, శ్యామలాదేవి పాల్తూరు పీహెచ్‌సీలకు బదిలీ అయ్యారు.

ఎంపీహెచ్ఏ(ఎం)ల సీనియారిటీ జాబితా

పని సర్దుబాటు కోసం వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న 46 మందితో ఎంపీహెచ్ఏ(మేల్)ల సీనియారిటీ జాబితాను డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ విడుదల చేశారు. ఈ జాబితాపై రెండు రోజుల్లో అభ్యంతరాలు తెలపాలని అందులో సూచించారు. వీరికి కౌన్సెలింగ్ నిర్వహించి డెంగీ, మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో సర్దుబాటు చేయనున్నారు.

25న ఆన్‌లైన్‌లో మోడల్ ఈఏపీసెట్

కర్నూలు సిటీ: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన ఆన్‌లైన్‌లో మోడల్ ఈఏపీసెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ సంఘం నగర నగర కార్యదర్శి సాయి ఉదయ్, నగర ఉపాధ్యక్షులు ఆర్యన్, పృధ్వి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీలో ఆన్‌లైన్ నిర్వహిస్తున్నామన్నారు. ఏపీఈఏపీ పరీక్షపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహిస్తున్నామని, విద్యార్థులందరు సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.

సంప్రదాయ ఇంధన వనరుల వాడకం తగ్గించాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు సంప్రదాయ ఇంధన వనరుల వాడకం తగ్గించాలని సెట్కూరు సీఈవో డాక్టర్ కె.వేణుగోపాల్ సూచించారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా యువజన సంక్షేమ శాఖ (సెట్కూరు) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కర్నూలు మండలం పసుపుల గ్రామంలోని శ్రీహరి అగ్రికల్చర్ అండ్ పాలిటెక్నిక్ కాలేజీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్కూరు సీఈవో కె.వేణుగోపాల్ మాట్లాడుతూ సౌరశక్తి వినియోగం కోసం ప్రభుత్వం అందించే వివిధ పథకాలను తప్పకుండా ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి బయోడిగ్రేడబుల్ వస్తువుల వాడకాన్ని పెంచాలని సూచించారు. అటవీ శాఖ తరుపున సంఘ మిత్ర, అనిమల్ ఫౌండేషన్ సభ్యులు మహ్మద్ ఇద్రిస్ మాట్లాడుతూ వన్యప్రాణులను సంరక్షించుకోవడం మన బాధ్యత అని, అడవులను వన్యప్రాణులను కాపాడుకోవడం ద్వారా పర్యావరణ సమతుల్యతను సాధించగలుగుతామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీత, సెట్కూరు సూపరింటెండెంట్ శ్యామ్, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సెట్కూరు సీఈవో డాక్టర్ కె.వేణుగోపాల్

శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడు వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభపూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.



శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్నఅర్చకులు

పోప్ ఫ్రాన్సిస్ సేవలు మరువ లేనివి

- బిషప్ గోరంట్ల జ్వాన్నేష్



పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళులర్పిస్తున్న బిషప్ గోరంట్ల జ్వాన్నేష్

కర్నూలు (టౌన్): క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ సేవలు మరువలేనివని కర్నూలు డయాసిస్ బిషప్ గోరంట్ల జ్వాన్నేష్ కొనియాడారు. మంగళవారం నంద్యాల చెక్‌పోస్టులోని సెయింట్ లూర్దుస్ కథిడ్రల్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ దైవసందేశం ఇస్తూ.. పోప్ ఫ్రాన్సిస్ మరణం క్యాథలిక్ సమాజానికి తీరనిలోటన్నారు. ఆయన పోప్‌గా బాధ్యతలు స్వీకరించిన క్షణం నుంచి తుదిశ్వాస వరకు ప్రపంచశాంతి, నవ సమాజ నిర్మాణం కోసం కృషి చేశారన్నారు. క్యాథలిక్ చర్చిలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎన్నో దేశాల మధ్యన యుద్ధ వాతావరణం నెలకొన్నప్పుడు అనుసంధానకర్తగా వ్యవహరించి శాంతి వెల్లి విరిసేలా కృషి చేశారన్నారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సెయింట్ లూర్దుస్ కథిడ్రల్ చర్చి ఫాదర్ సిద్ధిపోగుల దేవదాసు, కార్యదర్శి ఫాదర్ ప్రవీణ్, పాస్టర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కొత్తూరులో చోరీ

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరులో వెంకట సుబ్బయ్య అనే వ్యక్తి ఇంట్లో రూ. లక్ష రూపాయలు చోరీ అయ్యాయి. వ్యక్తిగత పనుల మీద బయటకు వెళ్లినప్పుడు రూ. 50 వేల చొప్పున రెండు సార్లు ఎత్తుకెళ్లారు. ఇంట్లో నగదు కనిపించకపోవడంతో మంగళవారకం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే విచారణ చేపట్టిన పోలీసులు ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అయితే, విచారణ సమయంలో అతను తప్పించుకొని వెళ్లాడు.

వ్యక్తి దుర్మరణం

బండి ఆత్మకూరు: కడమల కాలువ గ్రామానికి చెందిన కలసపాటి పెద్ద వెంకటస్వామి (42) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు.. మంగళవారం వంట చెరుకు తెచ్చుకునేందుకు ఆటోలో అడవికి వెళ్లాడు. అనంతరం ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో జమాలయ్య దర్గా వద్దకు చేరుకోగానే ఆటో అదుపు తప్పి చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో పెద్ద వెంకటస్వామి ఆటో కేబిన్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతునికి భార్య జయమ్మ ఉంది. సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.